ధర్నా చేస్తున్న బార్డాన్ కార్మికులు

కూలీ రేట్లు పెంచాలని బార్డాన్ కార్మికుల సమ్మె

ఖలీల్‌వాడి, డిసెంబర్ 5 : కూలీ రేట్లు పెంచాలని బార్డాన్ కార్మికులు కొన్ని రోజులుగా సమ్మె చేస్తున్నారు. ఇందులో భాగంగా నగరంలోని వ్యవసాయ మార్కెట్ ద్వారం వద్ద మంగళవారం నిరసన తెలిపారు. కార్మిక శాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షుడు మల్యాల గోవర్ధన్ మాట్లాడుతూ.. రెండేండ్లకోసారి కూలీ రేట్ల పెంపుపై ఒప్పందం జరుగుతున్నదని, ఈ సారి పెంచబోమంటూ యాజమాన్యం మొండిగా వ్యవహరిస్తున్నట్లు చెప్పారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా కార్మికులకు కూలీ రేట్లు కూడా పెంచాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించేందుకు కార్మిక శాఖ అధికారులు చొరవ చూపాలని కోరారు. సమ్మెలో దండె రాము, అబ్దుల్ విజయ్, రాజు, సురేశ్, గంగాధర్, కరుణాబాయి, భారతి, కార్మికులు పాల్గొన్నారు.

ఆలయ రికార్డుల పరిశీలన

నిజామాబాద్ కల్చరల్, డిసెంబర్ 5: నగరంలోని గాజుల్‌పేట్ బడా రాంమందిర్, సారంగపూర్ హనుమాన్ ఆలయాల రికార్డులను జిల్లా దేవాదాయ శాఖ అధికారులు మంగళవారం పరిశీలించారు. అధికారుల సమక్షంలో బడా రాంమందిర్, అనుబంధ ఆలయాల హుండీలకు సంబంధించిన సీల్‌ను ఈవోగా బాధ్యతలు చేపట్టిన గింజుపల్లి వేణు తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుదీర్ఘ కాలంపాటు కోర్టు వివాదాల్లో ఉన్న బడా రాంమందిర్ ఆలయాలన్ని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తిరిగి దేవాదాయశాఖ పరిధిలోకి తెచ్చామని చెప్పారు. ఇక నుంచి దైవ కైంకర్యాలన్నీ దేవాదాయ శాఖ అర్చకులే నిర్వహిస్తారని వివరించారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్లు ఆంజనేయులు, ప్రశాంత్‌కుమార్, దేవాదాయశాఖ పరిశీలకురాలు కమల, అర్చకులు మకరంద్ సకాయి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం అందేలా చూడాలి

ఇందల్వాయి, డిసెంబర్ 5 : మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో మంగళవారం డాక్టర్ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో ఆశ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఆరోగ్య ఉప కేంద్రంలో కొనసాగుతున్న కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం వైద్యుడు మాట్లాడుతూ.. ప్రతి గర్భిణి వివరాలను సేకరించి పౌష్టికాహారం అందేలా చూడాలన్నారు. ప్రభుత్వ దవాఖానల్లోనే ప్రసవం చేయించకునేలా ప్రోత్సహించాలని సూచించారు. హైపర్‌టెన్షన్, డయాబెటిస్ రోగులు ప్రభుత్వ దవాఖానల్లోనే మందులు తీసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. మలేరియా, డెంగీ, చికున్ గున్యా వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని, గ్రామాల్లో నీరు నిల్వలు లేకుండా, దోమల నివారణ చర్యలు తీసుకోవాలని గ్రామపంచాయతీ కార్యదర్శులకు సూచించారు. క్షయ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. సమావేశంలో మండల ఆరోగ్య విస్తీర్ణాధికారి అక్బర్‌అలీ, ఆరోగ్య కార్యకర్తలు, వెంకటరెడ్డి, ఆనంద్, ఫార్మాసిస్ట్ విజయలక్ష్మి, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్యారోగ్య సిబ్బందికి సూచనలిస్తున్న డాక్టర్ సంతోష్ కుమార్

శాస్త్ర సాంకేతికను భావి తరాలకు అందించాలి

టీయూ రిజిస్ట్రార్ యాదగిరి

డిచ్‌పల్లి, డిసెంబర్ 5 : టీయూలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రాంగణంలో 'జన్యుశాస్త్రంలో మార్పులు – ఆరోగ్య రంగంపై ప్రభావం' అనే అంశంపై ఏర్పాటు చేసిన సైన్స్ మొబైల్ ఎగ్జిబిషన్‌ను రిజిస్ట్రార్ యాదగిరి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువ సైంటిస్టులను తయారు చేసేలా సైన్స్ మొబైల్ ఎగ్జిబిషన్ నిర్వహించడం అభినందనీయమన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాన్ని భవిష్యత్తు తరానికి అందించినప్పుడే దేశం ముందడుగు వేస్తుందని అన్నారు. ఈ ఎగ్జిబిషన్ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందిస్తుందని వివరించారు. మానవ ఆరోగ్యానికి జన్యు నిర్మాణానికి ఉన్న సంబంధాన్ని సీసీఎంబీ హైదరాబాద్ విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ టెక్నాలజీ మ్యూజియం రిసోర్స్‌పర్సన్స్ వివరించారు. ప్రదర్శనలో 20 రకాల జన్యు నమూనాలు, వీడియోలు విద్యార్థులను శాస్త్రీయంగా ఆలోచించేలా ఉన్నాయి. ఎగ్జిబిషన్‌ను ఎస్సెస్సార్ డిగ్రీ కళాశాల, జడ్పీహెచ్‌ఎస్ సుద్దపల్లి, వందేమాతరం, ప్రెసిడెన్సీ, విక్టరీ, కృష్ణవేణి టాలెంట్ తదితర పాఠశాలల నుంచి 800 మంది విద్యార్థులు తిలకించి సందేహాలను నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సీహెచ్ హారతి, బయోటెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ జువేరియా, ఉజ్మా, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్ మామిడాల, డాక్టర్ మహేందర్‌రెడ్డి, డాక్టర్ కిరణ్మాయి, డాక్టర్ ప్రసన్న షీలా, డాక్టర్ ప్రసన్న, మలవత్ రమేశ్ నాయక్, సూపరింటెండెంట్ ఉమారాణి పాల్గొన్నారు.

మొబైల్ ఎగ్జిబిషన్‌ను తిలకించేందుకు వచ్చిన విద్యార్థులు, మాట్లాడుతున్న రిజిస్ట్రార్ యాదగిరి

వ్యవసాయ పనిముట్లకు రుణాలు

■ మహిళా సంఘాలు సద్వినియోగం చేసుకోవాలి: డీఆర్డీవో

మట్లాడుతున్న డీఆర్డీవో చందర్‌నాయక్

డిచ్‌పల్లి, డిసెంబర్ 5 : హార్వెస్టర్ తదితర వ్యవసాయ పనిముట్లు కొనుగోలు చేసేందుకు మహిళా సంఘాలకు రుణాలు పంపిణీ చేయనున్నట్లు డీఆర్డీవో చందర్‌నాయక్ తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాట్లు చేసుకోవాలని సూ చించారు. మండల కేంద్రంలోని టీటీడీసీలో మంగళవారం మహిళా సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2024 మార్చి 31 వరకు లక్ష్యం మేరకు రుణాలు తీసుకొని ఆదాయం సమకూర్చుకునేలా వ్యాపారాలు చేసుకోవాలన్నారు. స్త్రీ నిధిలో సోలార్ సిస్టమ్స్, ఎలక్ట్రిక్ వెహికిల్స్‌కు రుణాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. సమావేశంలో ఏపీడీ మధుసూదన్, డీపీఎంలు, ఏపీఎంలు పాల్గొన్నారు.

నర్సరీల్లో మొక్కల పెంపకంపై శ్రద్ధ చూపాలి

నిజామాబాద్ రూరల్, డిసెంబర్ 5 : నర్సరీల్లో చేపట్టే మొక్కల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంపీడీవో మల్లేశ్ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మండలంలోని చక్రధర్‌నగర్ తండా, గాంధీనగర్ తండా, మల్లారం, ధర్మారం తండా గ్రామాల్లో మంగళవారం పర్యటించారు. నర్సరీల్లో మొక్కల పెంపకం పనులను పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా వచ్చే యేడాది జూలైలో నాటడానికి మొక్కలను సిద్ధం చేయాలన్నారు. గాంధీనగర్ తండాలో కొనసాగుతున్న ఉపాధి పనులను తనిఖీ చేశారు. ఆయా గ్రామపంచాయతీల రికార్డులను పరిశీలించారు. ఎంపీడీవో వెంట సర్పంచులు అనూషా లక్ష్మణ్, సునీత రాంగోపాల్‌రెడ్డి, హరినాయక్, కార్యదర్శులు ప్రవీణ్, స్వప్న, కార్తీక, రాజు, శ్యామల ఉన్నారు.

చక్రధర్‌నగర్ తండాలో బ్యాగ్ ఫిల్లింగ్ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

నేటి నుంచి యూజీసీ నెట్ పరీక్షలు

నిజామాబాద్ రూరల్, డిసెంబర్ 5 : యూజీసీ నెట్ పరీక్షలు డిసెంబర్ 6 నుంచి14 వరకు నిర్వహించనున్నట్లు జిల్లా కో-ఆర్డినేటర్ మేరిగ భాస్కర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని బోధన్ రోడ్డులో ఉన్న ఏవీ ఎంటర్‌ప్రైజెస్, ఆర్మూర్‌లోని క్షత్రియ ఇంజినీరింగ్ కళాశాలలో ఆన్‌లైన్ విధానంలో పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మొదటి షిఫ్ట్, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు రెండవ షిఫ్ట్ పరీక్ష ఉంటుందని వివరించారు. ఏమైనా సందేహాలుంటే 8978198421 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఉపాధి పనులపై సమావేశం

ధర్పల్లి, డిసెంబర్ 5 : మండల పరిషత్ కార్యాలయంలో జీపీ కార్యదర్శులు, ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లతో ఎంపీడీవో లక్ష్మణ్, ఎంపీవో రాజేశ్ మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఉపాధి హామీ పనులకు సంబంధించి సామాజిక తనిఖీ, ప్రజావేదిక, ఆడిట్ నిర్వహించిన అనంతరం వచ్చిన అభ్యర్థనలకు ఫీల్డ్ అసిస్టెంట్లు సరైన సమాధానాలు పంపాలని సూచించారు. గ్రామాల్లో సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని కార్యదర్శులను ఆదేశించారు. ఏపీవో వినోద, ఈజీఎస్ టీఏలు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ధర్పల్లి, డిసెంబర్ 5 : మండలంలోని గోవిందుపల్లి పరిధిలోని వేంకటేశ్వర స్వామి ఆలయ 11వ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా తొలిరోజు స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ, వీడీసీ సభ్యులు తెలిపారు. శనివారం వరకు బ్రహ్మోత్సవాలు కొనసాగుతాయని చెప్పారు.

యువత రక్తదానం చేయాలి

జక్రాన్‌పల్లి, డిసెంబర్ 5 : ఆపదలో ఉన్నవారి ప్రాణాలు నిలబెట్టేందుకు యువత రక్తదానం చేయాలని స్వామి భాయ్ బ్లడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మాదరి స్వామి పిలుపునిచ్చారు. మండలంలోని బ్రాహ్మణ్‌పల్లి గ్రామానికి చెందిన స్వామి బ్లడ్ ఫౌండేషన్ స్థాపించి మంగళవారం ఏడాది పూర్తయిన సందర్భంగా ఆయన మాట్లాడారు. తమ సంస్థ ఆధ్వర్యంలో ఇప్పటివరకు 450 మందికి రక్తదానం చేశామన్నారు. ఈ సందర్భంగా బ్లడ్ ఫౌండేషన్ సిబ్బందికి స్థానిక సర్పంచ్ లతా దేవరాజు, ఎంపీటీసీ పోత రాజు అభినందనలు తెలిపారు.

భక్తి శ్రద్ధలతో పల్లివేట ఉత్సవం

నిజామాబాద్ కల్చరల్, డిసెంబర్ 5: జిల్లా కేంద్రంలోని అయ్యప్ప ఆలయంలో పల్లివేట ఉత్సవాన్ని మంగళవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా చెట్లపై ఉన్న ఆయుధాలను తీసుకెళ్లి వేటాడే క్రమాన్ని ఆలయ అర్చకుడు రమేశ్‌శర్మ భక్తులకు వివరించారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ అధ్యక్షుడు భక్తవత్సలం నాయుడు, అయ్యప్ప దీక్షాదారులు పాల్గొన్నారు.

నేడు అరట్టు..

అయ్యప్ప మాలధారులు విశేషంగా భావించే అరట్టు ఉత్సవాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు. అయ్యప్ప ఆలయం నుంచి శోభాయాత్రను ప్రారంభించి ఎన్టీఆర్ చౌరస్తా, ఖలీల్‌వాడి, పెద్దబజార్ మీదుగా ఖిల్లా బొడ్డెమ్మ చెరువు (పంపుహౌజ్) వరకు చేరుకుంటుందని చెప్పారు. తీర్థ స్నానాలు నిర్వహించి, మహాభిక్ష అనంతరం శోభాయాత్ర తిరిగి అయ్యప్ప ఆలయానికి చేరుకుంటుందని వివరించారు.

ఆరోగ్య విస్తీర్ణాధికారి శంకర్‌కు ఉత్తమ కవితా పురస్కారం

అమృతలత చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న శంకర్

డిచ్‌పల్లి, డిసెంబర్ 5 : ఇందల్వాయి ప్రాథమిక ఆరోగ్య విస్తీర్ణాధికారి వై.శంకర్‌కు ఉత్తమ కవితా పురస్కారం దక్కింది. జిల్లాకేంద్రంలో సోమవారం హరిదా రచయితల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కవి సమ్మేళనంలో శంకర్ రచించిన 'పోగు కొక్క చెమట చుక్క' ప్రశంసలు పొందగా, విజయ్ విద్యాసంస్థల అధినేత అమృతలత చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు.